# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం-16- మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 355 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ఉగ్రవాదుల అప్పగింతపై భారత్ స్పష్టం -జైశంకర్ హెచ్చరిక

- పాక్ ఉగ్రవాదుల్ని అప్పగించాలి
- భారత్‌కు విధిగా అప్పగించాల్సిందే అనే తీర్పు
- ఉగ్రవాదులపై భారత్ కఠిన వైఖరి
- కాల్పుల విరమణ వెనుక ఎవరు ఉన్నారో అందరికీ తెలుసు
- ఉగ్రవాదం, పీవోకే అంశాలపై మాత్రమే చర్చలు
- సింధూ జలాల ఒప్పందంపై యథాతథ స్థితి కొనసాగింపు
- ఉగ్రవాదానికి మౌలిక వసతులు అంతమవ్వాల్సిందే

3లో..



## యుద్ధ వీరులను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్

- సైనికుల ధైర్యసాహసం దేశానికి గర్వకారణం
- అమర సైనికులకు సెల్యూట్
- గాయపడిన యోధులకు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- ఉగ్రవాదంపై యుద్ధం – పీవోకే వరకు కొనసాగుతుంది
- ఉగ్రవాదం ఎక్కడైనా చిత్తుగా మట్టుపెట్టుతాం
- పీవోకేపైనా పోరాటం ఆగదు
- పాక్ అణ్వాయుధాల బ్లాక్‌మెయిల్‌కు భయపడబోము
- ఏవిధమైన పరిస్థితులనైనా ఎదుర్కొనగల మన సైన్యం
- శత్రు బంకర్లు ధ్వంసంపై మంత్రి వ్యాఖ్య

3లో..



## సరస్వతీ పుష్కర స్నానం ఆచరించిన సీఎం రేవంత్‌రెడ్డి

- కాళేశ్వరం చేరుకున్న సీఎం, మంత్రులతో కలిసి పవిత్ర స్నానంలో పాల్గొన్న ఘట్టం
- కాళేశ్వరం వద్ద పుష్కరాల ఘన ఆరంభం
- గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల త్రివేణి సంగమంలో ప్రారంభమైన 12 రోజుల పుణ్యకార్యం
- సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ చేసిన ముఖ్యమంత్రి
- పుష్కర ఘాట్ ప్రారంభంతో పాటు సాంస్కృతికంగా కీలక ఘట్టంగా విగ్రహ ప్రతిష్ఠ
- భక్తుల కోసం ఆధునిక సౌకర్యాలు – యాప్, వెబ్ పోర్టల్ ప్రారంభం
- రోజు 50 వేలకుపైగా భక్తుల రాక
- స్నాన ఘాట్లు, పిండప్రదానం, ప్రత్యేక పూజల కోసం విస్తృత ఏర్పాట్లు
- శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి విశేష భక్తుల సందడి
- పుష్కరాల సందర్భంగా భక్తులు క్షేత్ర దర్శనంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతికి తరలివచ్చిన దృశ్యం

2లో..



# గచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై తెలంగాణ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక

పర్యావరణ పరిరక్షణలో నిర్లక్ష్యం చూపితే ముఖ్య కార్యదర్శితో పాటు
ఇతర అధికారులపై చర్యలు తప్పవని కోర్టు స్పష్టం
లాంగ్ వీకెండ్‌లో చెట్ల తొలగింపు ఎందుకు? – కోర్టు ప్రశ్న
పక్కా ప్రణాళికతో చెట్లు నరికినట్లు
అనుమానం వ్యక్తం చేసిన ధర్మాసనం
పర్యావరణ అనుమతులు తీసుకున్నారా లేదా?
స్పష్టం చేయండి – జస్టిస్ గవాయ్ ఆదేశం
నష్టాన్ని పూడ్చేందుకు చేపట్టే చర్యలపై పూర్తి వివరాలు
సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు
విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసులు: కోర్టు స్పష్టత
హెచ్‌సీయూ విధ్వంసంపై కేంద్ర కమిటీ నివేదిక
చెట్లతో పాటు జంతుజీవాలకు కూడా నష్టం – ఏప్రిల్ 15న
సమర్పించిన నివేదిక వివరాలు
మే 15 వరకు పునరుద్ధరణ చర్యలపై నివేదిక ఇవ్వండి – కోర్టు ఆదేశం
చెట్ల నాటకపోతే చర్యలు తప్పవని గతంలోనే హెచ్చరించిన



**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం కీలక వ్యాఖలు చేసింది. పర్యావరణ నష్టం పూడ్చకపోతే సీఎస్ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించిన ధర్మాసనం హెచ్చరించింది. సీఎస్‌తో పాటు కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని చెప్పింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చాల్సిందేనని.. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా?

మిగతా 2లో..

## చిన్నారి వేదవల్లి కుటుంబానికి ఆర్థిక చేయూత


- వేదవల్లి కోసం తల్లిదండ్రుల నిరంతర పోరాటం
- రెండేళ్లపాటు అనేక ఆసుపత్రుల్లో చికిత్స.. భారంగా మారిన వైద్య వ్యయం
- ముఖ్యమంత్రి సహాయం: రూ. 8 లక్షల మంజూరు
- బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స కోసం సీఎం రేవంత్ రెడ్డి స్పందన
- వేదవల్లిని కోల్పోయిన కుటుంబం – ఆర్థిక భారం తాళలేక
- చికిత్స అనంతరం చిన్నారి మృతి.. కుటుంబానికి ఆర్థిక భరోసా అవసరం
- సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అదనంగా రూ. 7 లక్షల సహాయం
- వైద్య ఖర్చుల పేరిట గత వ్యయాన్ని కవర్ చేయడానికి సీఎం ఆదేశం
- చెక్కు అందజేత: సచివాలయంలో మానవత్వం పరిమళం



**హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)**

అల్లారుముద్దుగా పెంచుకున్న పాప ఒక్కసారిగా అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి తీసుకెళితే బ్లడ్ క్యాన్సర్ అని పరీక్షల్లో తేలింది. పాపను రక్షించుకునేందుకు తల్లిదండ్రులు రూ.లక్షలు వెచ్చించారు. విషయం ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి దృష్టికి రావడంతో పాప చికిత్సకు రూ. 8 లక్షలు మంజూరు చేశారు. వ్యాధి ముదరడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. ఆమె చికిత్సకు గతంలో చేసిన వ్యయానికి సంబంధించి మరో రూ.7 లక్షలను సీఎంఆర్‌ఎఫ్ నుంచి విడుదల

మిగతా 2లో..



## పాక్‌కు డ్రోన్ మద్దతు ఇచ్చిన టర్కీ

- టర్కీ చేతికిందకాలిన పాక్ కుట్ర – భారత్‌పై డ్రోన్ దాడుల్లో మద్దతు
- టర్కీ డ్రోన్లతో పాక్‌కు మద్దతు – ఆపరేటర్లూ టర్కీ దేశస్తులే
- సహాయం చేసిన దేశాన్నే వెన్నుపోటు – టర్కీపై భారత్ ఆగ్రహం
- సెలెబీ గ్రౌండ్ హ్యాండ్లింగ్‌కు భారత్ షాక్ – భద్రతా అనుమతులు రద్దు
- తొమ్మిది విమానాశ్రయాల్లో కీలక బాధ్యతలు – టర్కీ సంస్థపై బంపరుజెడ్
- టర్కీ సంస్థపై నిఘా.. భారత భద్రతలో దెబ్బతీయాలన్న కుట్రను ఛేదించిన అధికారులు
- భారత్‌కు టర్కీ తొలి స్ట్రోక్ – సెక్యూరిటీ క్లియరెన్స్ తొలగింపు

**న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)**

పాకిస్తాన్ పై ఉగ్రవాదంపై పోరులో ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా, దానికి వ్యతిరేకంగా పని చేసింది టర్కీ (తుర్కియే). ఇక్కడ ప్రత్యక్షంగా పాకిస్తాన్ కు సాయం చేసి భారత్ ను దెబ్బ కొట్టాలని యత్నించింది. పాకిస్తాన్ ప్రయోగించిన డ్రోన్లలో సింహ భాగం టర్కీకి చెందినవే కావడమే కాకుండా, ఆ డ్రోన్లకు ఆపరేటర్లను కూడా సప్లై చేసింది టర్కీ. ఇది భారత్ కు మరింత కోపం తెప్పించింది. టర్కీ నుంచి ఏమైనా డ్రోన్లను కొనుగోలు చేశారా అని తొలుత భావించినా, ఆ డ్రోన్ల ఆపరేటర్లు కూడా ఆ దేశానికే చెందిన వారే కావడంతో వారి పన్నాగం బయటపడింది.

మిగతా 2లో..

## సుప్రీంకోర్టు తీర్పులపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందన



- సుప్రీంకోర్టు తీర్పులపై రాష్ట్రపతి ఘాటైన వ్యాఖ్యలు
- తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో న్యాయ తీర్పుపై స్పందన
- గవర్నర్, రాష్ట్రపతి కార్యచరణలపై గడువు విధింపుపై ఆవేదన
- ఆర్టికల్ 200పై రాష్ట్రపతి అభిప్రాయం
- గవర్నర్ బిల్లుపై స్పందించడానికి గడువు లేదు
- రాజ్యాంగంలో స్పష్టమైన సమయం సూచనలు లేవని వ్యాఖ్య
- రాష్ట్రపతికి ఆర్టికల్ 143 ప్రకారం ప్రత్యేక హక్కులు
- సుప్రీంకోర్టు అభిప్రాయం కోరే అధికారం
- తీర్పు సరైనదేనా అన్న సందేహంతో ప్రశ్నలు

2లో..

## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### భారత్‌కు జీరో టారిఫ్ ట్రేడ్ ఒప్పందం?

- అమెరికా వస్తువులపై సుంకాల తొలగింపు గురించి ట్రంప్ వెల్లడి
- భారత్ అధికారిక స్పందన లేకపోవడం చర్చనీయాంశం
- ట్రంప్ ప్రకటనపై భారత ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు
- భారత్‌లో వాణిజ్యం చేయడం చాలా కష్టమని ట్రంప్ వ్యాఖ్య
- కాల్పుల విరమణపై అమెరికా ప్రభావం: ట్రంప్ వ్యాఖ్యలు
- కాల్పులు ఆపకపోతే వాణిజ్యం నిలిపేస్తామని తెలిపిన అమెరికా
- ఆపిల్ ఉత్పత్తి విస్తరణకు ట్రంప్ వ్యతిరేకత



3లో..

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై తెలంగాణ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)



స్పష్టం చేయాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదేశించింది. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చెట్ల తొలగింపు పనులు చేపట్టారని మరోసారి ధర్మాసనం ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలు స్పష్టంగా చెప్పాలని ఆదేశించింది. కేంద్ర సాధికార సంస్థ నివేదికపై కౌంటర్ దాఖలుకు తెలంగాణ ప్రభుత్వం సమయం కోరింది. ఈ సందర్భంగా విజిల్ బోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని ప్రస్తావించిన న్యాయవాదులు కోర్టు ఎదుట ప్రస్తావించారు. కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేశామన్న న్యాయవాదులు తెలిపారు. అయితే, ఈ పిటిషన్‌తో కలిసి విచారించడం కుదరదని.. కేసులు కొట్టివేయాలన్న అప్లికేషన్స్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. అవసరమైతే మరో పిటిషన్ వేయాలని కోర్టు సూచించింది. కంచగచ్చబౌలి భూముల వ్యవహారంపై విచారణను జులై 23వ తేదీకి వాయిదా వేసింది.

హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

# పాక్‌కు డ్రోన్ మద్దతు ఇచ్చిన టర్కీ

(మొదటి పేజీ తరువాయి)

దాంతో టర్కీపై విమర్శలు వెల్లువెత్తాయి. వరదల సమయంలో ఏ దేశం కూడా సాయం చేయడానికి ముందుకు రాకపోతే భారత్ వారికి ఆపన్న హస్తం అందించింది. దానిని మరిచిపోయి మన వేలితో మనల్నే పొడాలని చూసింది టర్కీ. ఇప్పుడు టర్కీకి బుద్ధి చెప్పే సమయం వచ్చేసింది.

**సెక్యూరిటీ క్లియరెన్స్ అనుమతులు రద్దు..!**

భారతదేశంలోని తొమ్మిది ప్రధాన విమానాశ్రయాలలో సింహభాగాన్ని నిర్వహిస్తున్న టర్కిష్ సంస్థ తన భద్రతా అనుమతిని కోల్పోయింది. గురువారం సాయంత్రం భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ టర్కీకి చెందిన సంస్థకు అనుమతులు రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. జాతీయ భద్రత దృష్ట్యా సెలెబి గ్రౌండ్ హ్యాండ్లింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భద్రతా అనుమతిని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**ఇప్పటివరకూ ఉన్న పరిస్థితి ఇది..!**

భారత్‌లోని పలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా అంశాల్లో కూడా తుర్కియే పరోక్షపాత్ర ఉంది. .వాటిలో కార్గో హ్యాండ్లింగ్ వంటి కీలక కాంట్రాక్టులను తుర్కియేకు చెందిన సెలెబీ ఏవియేషన్ కంపెనీ చెందిన అనుబంధ సంస్థ సంపాదించింది. భారత్‌లో 2008 నుంచి ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏటా 58,000 విమానాలు, 5.4 లక్షల టన్నుల సరకు రవాణా బాధ్యతలను చూసుకుంటోంది. అందులో 7,800 మంది సిబ్బంది ఉన్నారు.

హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, గోవా, కొచ్చిన్, కన్నూర్ వంటి కీలక విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ బాధ్యతలు సెలెబీవే! గ్రౌండ్ హ్యాండ్లింగ్, కార్గో మేనేజ్‌మెంట్, ఎయిర్‌సైడ్ ఆపరేషన్స్ విధులను ఈ సంస్థే చూస్తోంది. విమానాలను నిలిపి ఉంచే హై సెక్యూరిటీ జోన్, ఎయిర్‌సైడ్ జోన్లల్లా సంస్థ సిబ్బందే విధుల్లో ఉంటున్నారు. ప్రయాణికుల బ్యాగులు, కార్గో పనులను చూసుకునేదీ వాళ్లే. అంతర్జాతీయ సర్వీసుల్లో కూడా ఈ బాధ్యతలను వీళ్లకే అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో దీనిపై ఆందోళనలు చోటు చేసుకున్నాయి. దాంతో భారత ప్రభుత్వం.. చర్యలు చేపట్టి ఆ సంస్థకు చెందిన అనుమతులను రద్దు చేసింది. ఇది తుర్కియేగా పిలువబడుతున్న టర్కీకి భారత్ ఇచ్చిన తొలి స్ట్రోక్.

# చిన్నారి వేదవల్లి కుటుంబానికి ఆర్థిక చేయూత

(మొదటి పేజీ తరువాయి)



చేయాలని సీఎం శ్రీరేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు ఆ మొత్తాన్ని విడుదల చేశారు... వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ ఎల్బీ నగర్‌కు చెందిన రఘు, మంజుల దంపతులు. రఘు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. రఘు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె వేదవల్లికి (5) 2022లో తీవ్ర జ్వరం రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు బ్లడ్ క్యాన్సర్ (అనాప్లాస్టిక్ లార్జ్ సెల్ లార్జ్ లింఫోమా) అని తేల్చారు. పాపను రక్షించుకునేందుకు రెండేళ్ల పాటు తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల చుట్టూ తిప్పారు. చికిత్స వ్యయం నానాటికీ భారమవడంతో 2024లో ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వేదవల్లి చికిత్సకు అవసరమైన రూ.8 లక్షలను మంజూరు చేశారు. చికిత్స అందించినప్పటికీ అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో గతేడాది చివరలో వేదవల్లి మరణించింది. ఆమె చికిత్సకు గతంలో ఆ కుటుంబం పెద్ద మొత్తంలో ఖర్చు చేసింది. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రూ.7 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు వేదవల్లి తండ్రి రఘుకు గురువారం సచివాలయంలో అందజేశారు.





# సరస్వతీ పుష్కర స్నానం ఆచరించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.





# హైదరాబాద్ లో మెట్రో చార్జీల పెంపు

హైదరాబాద్ (తెలంగాణ ముచ్చట్లు)

మెట్రో చార్జీల పెంపుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో చార్జీలను భారీగా పెంచింది మెట్రో రైలు సంస్థ. హైదరాబాద్ మెట్రో వేలాది మంది ఉద్యోగులకు, విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ మెట్రోలో ప్రతి రోజు లక్షలాది మంది ప్రజలు ప్రయాణిస్తూ.. సులువుగా వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అయితే గత కొంతకాలంగా ఎల్ అండ్ టి సంస్థ నష్టాల్లో కొనసాగుతోంది. దీంతో ఛార్జీల పెంపుపై ప్రభుత్వానికి మెట్రో సంస్థ నివేదికలు అందజేసింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో చార్జీలను పెంచుతున్నట్లు మెట్రో యాజమాన్యం ప్రకటించింది. కనిష్ఠ ధర రూ.10 నుంచి రూ.12కు, గరిష్ఠ ధర రూ.60 నుంచి రూ.75కు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. పెంచిన చార్జీలు ఎల్లుండి (మే 17) నుండి అమలులోకి రానున్నట్టు మెట్రో రైలు సంస్థ వెల్లడిరచింది.ప్రస్తుతం మెట్రో ఆపరేషన్స్, మాల్స్ అద్దెలు, ప్రకటనల ద్వారా ఏటా రూ. 1500 కోట్ల వరకు ఆదాయం మెట్రోకు సమకూరుతోంది. తాజా చార్జీల పెంపుతో అదనంగా మరో రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే, మెట్రో చార్జీల పెంపు నిర్ణయంతో సామాన్య ప్రయాణికులపై భారం పడే అవకాశం ఉంది.



# సుప్రీంకోర్టు తీర్పులపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పందన

న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా ఖండించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో, రాష్ట్ర బిల్లులపై గవర్నర్, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై తాజాగా ద్రౌపదీ ముర్ము స్పందించారు.

ఈ క్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు పశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు సమాచారం. ఈ అంశంపై స్పందించేందుకు భారత ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.



అలాగే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 గవర్నర్ అధికారాలను, బిల్లులకు ఆమోదం తెలపడం లేదా నిలిపివేయడం, రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును రిజర్వ్ చేయడం వంటి విధానాలను వివరిస్తుందని రాష్ట్రపతి హైలైట్ చేశారు. అయితే, ఈ రాజ్యాంగ ఎంపికలను ఉపయోగించుకోవడానికి గవర్నర్‌కు ఎలాంటి గడువును ఆర్టికల్ 200లో పేర్కొనలేదని అన్నారు.

**సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..**

- రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు నిర్దేశిస్తాయా?.
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?.
- రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి రాజ్యాంగ విచక్షణ వినియోగం న్యాయ సమ్మతమైనదా?
- రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?.
- సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?.
- ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?.
- రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా? అని ప్రశ్నించారు.

# ఉగ్రవాదుల అప్పగింతపై భారత్ స్పష్టం -జైశంకర్ హెచ్చరిక



న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

పాక్ ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించాల్సిందేనని భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. కాల్పుల విరమణ ఎవరు కోరుకున్నారో అందరికీ తెలుసునంటూ ఆయన వ్యాఖ్యానించారు. భారత్ కేవలం పీవోకే, టెర్రరిజం గురించి మాత్రమే మాట్లాడుతోంది. సింధూ జలాల నిలిపివేతపై యథాతథ స్థితి కొనసాగుతోంది. ఉగ్రవాదులకు మౌలిక వసతులు కల్పించే వ్యవస్థను రుపుమాపాలి'' అని జైశంకర్ పేర్కొన్నారు.

పాకిస్థాన్‌తో చర్చలు ఉగ్రవాదంపై మాత్రమే ఉంటాయని ప్రధాని చాలా స్పష్టంగా చెప్పారని జైశంకర్ గుర్తు చేశారు. ఉగ్రవాదంపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ చెప్పారు.

కాగా, ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో తాజా ఉద్రిక్తతలు, నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో మంత్రులు, సీనియర్ ఉన్నతాధికారుల భద్రతపై కేంద్రం నిశితంగా దృష్టి పెట్టింది. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌కు భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. మంత్రి కాన్వాయ్‌లో మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను చేరుస్తూ కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది.

ఢిల్లీలోని ఆయన నివాసం చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. జైశంకర్‌కు భద్రతను 2023లో వై నుంచి జెడ్ కేటగిరీకి పెంచారు. ఇప్పటికే రెండో అత్యున్నత స్థాయి భద్రత. అందులో భాగంగా 33 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ కమాండోల బృందం 24 గంటలూ ఆయనను కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటుంది. జెడ్ కేటగిరీలో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), 4 నుండి ఆరుగురు స్థానిక పోలీసు మంది కమాండోలతో సహా 22 మంది సిబ్బంది, ఒక బుల్లెట్ ప్రూఫ్ వాహనం, ఎస్కార్ట్ వాహనాలుంటాయి. సాధారణంగా ఉన్నత స్థాయి రాజకీయ నాయకులకు, ప్రముఖులకు, బెదిరింపులను ఎదుర్కొంటున్న వారికి ఈ స్థాయి భద్రత అందిస్తారు. కేంద్ర రక్షణ జాబితాలోని వీఐపీ భద్రతా కవర్ జెడ్-ప్లస్ (అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్), జెడ్, వై, వై-ప్లస్, ఎక్స్ దాకా ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా దాదాపు 200 మందికి సీఆర్‌పీఎఫ్ వీఐపీ భద్రతా సంరక్షణ ఉంది.



# యుద్ధ వీరులను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్

- సైనికుల ధైర్యసాహసం దేశానికి గర్వకారణం
- అమర సైనికులకు సెల్యూట్
- గాయపడిన యోధులకు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- ఉగ్రవాదంపై యుద్ధం – పీవోకే వరకు కొనసాగుతుంది
- ఉగ్రవాదం ఎక్కడైనా చిత్తుగా మట్టుపెట్టుతాం
- పీవోకేపైనా పోరాటం ఆగదు
- పాక్ అణ్వాయుధాల బ్లాక్‌మెయిల్‌కు భయపడబోము
- ఏవిధమైన పరిస్థితులనైనా ఎదుర్కొనగల మన సైన్యం
- శత్రు బంకర్లు ధ్వంసంపై మంత్రి వ్యాఖ్య



న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను అంతం చేశామన్నారు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. అలాగే, దేశమంతా సైనికులను చూసి గర్విస్తోందన్నారు. అమరులైన సైనికులకు సెల్యూట్ చేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు.

రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ గురువారం జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ యుద్ధ వీరులను రాజ్‌నాథ్ అభినందించారు. అనంతరం, రాజ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ..'సైనికుల ధైర్యసాహసాలు గర్వకారణం. ఉగ్రవాదం అంతానికి ఎంత దూరమైనా, ఎక్కడికైనా వెళ్తాం. ఉగ్రవాదంపైనే కాదు.. పీవోకేపైనా మన యుద్ధం ఆగదు. పాకిస్తాన్ అణ్వాయుధాల బ్లాక్‌మెయిల్‌కు భయపడం. ఎలాంటి పరిస్థితులలైనా మన సైన్యం ఎదుర్కోగలదు' అంటూ ప్రశంసలు కురిపించారు.

శత్రువులను నాశనం చేసిన ఆ శక్తిని అనుభూతి చెందడానికి నేను ఇక్కడ ఉన్నాను. సరిహద్దు వెంబడి పాకిస్తాన్ చౌకీలు, బంకర్లను మీరు ధ్వంసం చేసిన విధానాన్ని, శత్రువు దానిని ఎప్పటికీ మరచిపోలేదని నేను భావిస్తున్నాను. పాకిస్తాన్ అణ్వాయుధాలను అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణలోకి తీసుకోవాలని కోరుతున్నాను. అలాగే, పహల్గామ్ దాడి తర్వాత, జమ్ముకశ్మీర్ ప్రజలు పాకిస్తాన్, ఉగ్రవాదులపై తమ కోపాన్ని వ్యక్తం చేసిన విధానం గర్వంగా ఉంది అంటూ వ్యాఖ్యలు చేశారు.

# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

## భారత్‌కు జీరో టారిఫ్ ట్రేడ్ ఒప్పందం?

న్యూఢిల్లీ (తెలంగాణ ముచ్చట్లు)



అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం గురించి సుంకాల విషయంలో సంచలన ప్రకటన చేశారు. భారతదేశం అమెరికాకు జీరో టారిఫ్ ట్రేడ్ ఒప్పందాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. కానీ ఈ విషయంలో భారతదేశం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ట్రంప్ ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో ఖతార్ రాజధాని దోహాలో వ్యాపారవేత్తల ప్రతినిధి బృందంతో జరిగిన చర్చలో ఈ విషయాన్ని తెలిపారు. అమెరికా వస్తువులపై సుంకాలను తొలగించడానికి భారతదేశం ముందుకొచ్చిందని ట్రంప్ అన్నారు. ఈ క్రమంలో భారతదేశంలో ఏదైనా అమ్మడం చాలా కష్టమని ట్రంప్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

**రెండు దేశాల మధ్య..**

ఇదే సమయంలో భారతదేశం, పాకిస్థాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ గురించి కూడా ప్రస్తావించారు. విరమణ లేకుంటే రెండు దేశాలతో వాణిజ్యాన్ని నిలిపివేస్తామన్నామని, ఆ తర్వాత వారు కాల్పుల విరమణకు అంగీకరించారని పేర్కొన్నారు. దీంతోపాటు ఆపిల్ సీఈఓ టిమ్ కుక్‌తో మాట్లాడానని, భారతదేశంలో ఆపిల్ ఉత్పత్తిని విస్తరించవద్దని కోరానని ట్రంప్ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలతో భారత పెట్టుబడిదారులు, ప్రజలు నిరాశ చెందారు. భారతదేశం, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటనతో ఈ నిరాశ మరింత పెరిగింది. రెండు దేశాల మధ్య సైనిక సంఘర్షణను నివారించడానికి రాజీ మార్గంగా వాణిజ్యాన్ని ఉపయోగించడం భారతదేశంలో ఎవరికీ ఇష్టం లేదు.

**భారతదేశంలో ఆపిల్ పరిస్థితి**

అమెరికా సుంకాలపై పలు దేశాలతో ఉద్రిక్తతలు ఉన్న నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఆపిల్ భారతదేశంలో తన తయారీ సామర్థ్యాన్ని క్రమంగా విస్తరిస్తోంది. ఆ కంపెనీ ఫాక్స్‌కాన్, విస్ట్రాన్ వంటి తయారీదారుల ద్వారా దేశంలో ఐఫోన్‌లను తయారు చేస్తుంది. ఈ ప్రయత్నాలు ఎలక్ట్రానిక్స్‌లో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. కానీ ట్రంప్ తాజా ప్రకటనలు దీనిపై సంక్షోభం ఏర్పడేలా చేస్తున్నాయి.

**చర్చల కోసం..**

ఈ క్రమంలోనే భారత వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ మే 17 నుంచి 20 వరకు అమెరికాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో భారత్ సుంకాల విషయంపై చర్చించనున్నారు. ఏప్రిల్ 2న ట్రంప్ దాదాపు 60 దేశాలపై సుంకాలు విధించారు. ఇందులో భారతదేశం కూడా ఉంది, ఇండియాపై 26 శాతం సుంకం విధించారు. అయితే, ఏప్రిల్ 10న ట్రంప్ చైనా మినహా అన్ని దేశాలపై సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేశారు. భారతదేశం ఇప్పుడు అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే ప్రయత్నాలలో నిమగ్నమై ఉంది. ఈ సుంకాల వివాదం అలాగే కొనసాగితే వాణిజ్య యుద్ధం వచ్చే ఛాన్సుంది.

# స్వల్పంగా దిగి వచ్చిన పసిడి.. అదే బాటలో వెండి..



భారతీయులకు బంగారం కొనుగోలు చేయడం భలే ఇష్టం. ఈ ఇష్టంతోనే ఎటువంటి సందర్భం వచ్చినా సరే వెంటనే బంగారం నగలు కొనుగోలు చేయడనికి ఆసక్తిని చూపిస్తారు. అందుకనే ప్రతి సంవత్సరం టన్నులకు టన్నుల బంగారం మన దేశం దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్ లో పరిస్థితి ఆధారంగా దేశీయంగా కూడా పసిడి వెండి ధరలపై ప్రభావం చూపిస్తాయి. పసిడి , వెండి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. భారతీయులు బంగారం నగలను ఓ స్టేటస్ సింబల్ గా మాత్రమే కాదు ఎప్పుడైనా అనుకోని విధంగా ఆర్ధిక ఇబ్బందులు కలిగే అప్పుడు బంగారం ఆదుకుంటుందని .. ఆర్ధిక భరోసా ఇస్తుందని నమ్మకం. అందుకనే పండగలు, పెళ్ళిళ్ళు, శుభ కార్యాలు ఇలా ఏ సందర్భం వచ్చినా .. ఇంకా చెప్పాలంటే ఎప్పుడు డబ్బులు ఉంటే అప్పుడు.. ఏడాది పొడవునా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తినిమ చూపిస్తూ ఉంటారు. అదే సమయంలో ప్రస్తుతం బంగారం, వెండిపై పెట్టుబడులను పెట్టడానికి ముదుపర్లు ఆసక్తిని చూపిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం బంగారం ధర ఆల్ టైం హైకి చేరుకొని పసిడి ప్రియులకు షాక్ ఇచ్చింది. అయితే అంతర్జాతీయ మార్కట్ లో డాలర్ బలపడడంతో నేడు బంగారం ధర స్వల్పంగా తగ్గింది. హైదరాబాద్ లో గురువారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 88,040 ఉండగా.. 24 క్యారెట్ల (మేలిమి బంగారం) 10 గ్రాముల బంగారం ధర రూ.96,050 లుగా కొనసాగుతోంది. ఇవే ధరలు తెలుగురాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, పొద్దుటూరులలో కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040గా ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.96,200 లుగా ఉంది. దేశ ఆర్ధిక రాజధాని ముంబైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,040 వద్ద ఉంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 96,050 వద్ద కొనసాగుతోంది. ఇవే ధరలు దేశంలో ప్రధాన నగరాలైన కేరళ, కోల్ కతా, పూణే, బెంగళూరు లో కూడా కొనసాగుతున్నాయి. బంగారంతో పాటు వెండి కూడా మంచి ఆదరణ ఉంది. ఎటువంటి సందర్భం వచ్చినా బహుమతులుగా వెండి వస్తువులు ఇవ్వడానికి ఆసక్తిని చూపిస్తారు. అయితే గతంలో కంటే ఇప్పుడు వెండితో రకరకాల ఆభరణాలను తయారు చేస్తున్నారు. ఇవి నేడు ట్రెండీగా నిలుస్తున్నాయి. ఈ నేపధ్యంలో కిలో వెండి ధర ఒకానొక సమయంలో లక్ష దాటింది కూడా.. ఈ నేపధ్యంలో నేటి వెండి ధర ఎలా ఉన్నదో తెలుసుకుందాం.. దేశ వ్యాప్తంగా పసిడి బాటలో నడుస్తూ వెండి ధర స్వల్పంగా దిగి వచ్చింది. ఈ నేపద్యంలో రోజు గురువారం కేజీ వెండి ధర రూ. 1,08,900లు ఉండగా.. ఇదే ధర కేరళ, చెన్నై లో కూడ ఉంది. అయితే దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 97,800 ఉంది. ఇదే ధర కోల్ కతా, బెంగుళూరు లో కొనసాగుతోంది.

# మైక్రోసాఫ్ట్‌లో 6వేల మందికి ఎసరు




ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వేలాది మంది ఉద్యోగులపై వేటు వేయడానికి సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందిని తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో దాదాపు 6,000 మంది ఉద్యోగులు రోడ్డున పడనున్నారు. 2023లో 10,000 మందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. మైక్రోసాఫ్ట్‌లో 2024 జూన్ నాటికి 2.28 లక్షల మంది సిబ్బంది పని చేస్తోన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కూడా పనితీరు ఆధారంగా పలువురు ఉద్యోగులను సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూనే ఉంటామని మైక్రోసాఫ్ట్ సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని తెలుస్తోంది.



# ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్

దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ లాభాలు నమోదు చేశాయి. గత నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6 ఏళ్ల కనిష్ఠ స్థాయి 3.16 శాతానికి తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులు కొనసాగడంతో పాటు మెటల్, ఇండస్ట్రియల్ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 182.34 పాయింట్ల వృద్ధితో 81,330.56 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎసఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.79 లక్షల కోట్లు పెరిగి రూ.434.89 లక్షల కోట్లకు (5.10 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. భారత్ జపాన్‌ను వెనక్కి నెట్టి ఆసియాలో అత్యంత ప్రాధాన్య ఈక్విటీ మార్కెట్‌గా నిలిచింది. బ్యాంక్ ఆఫ్ అమెరికా తాజాగా నిర్వహించిన ఆసియా ఫండ్ మేనేజర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న ఫండ్ మేనేజర్లలో 42 శాతం భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడులకు మొగ్గుచూపారు. ఈ విషయంలో జపాన్ రెండో స్థానానికి జారుకోగా.. గతనెల అట్టడుగు స్థాయిలో నిలిచిన చైనా మళ్లీ మూడో స్థానానికి ఎగబాకింది.

# ఏజీఐ గ్రూప్‌తో స్టాండర్డ్ గ్లాస్ ఒప్పందం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్).. జపాన్‌కు చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడిరచింది. ఈ ఒప్పంద కాలపరిమితి 20 సంవత్సరాలని తెలిపింది. ఒప్పందంలో భాగంగా జీఎల్ హక్కోకు చెందిన గ్లాస్‌లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను భారత్‌లో తయారు చేయటంతో పాటు మార్కెట్ చేయనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ తెలిపింది. ఇప్పటి వరకు ఈ స్పెషలైజ్డ్ పరికరాలను పూర్తిగా దిగుమతి చేసుకుంటూ వస్తున్నామని, భారత్‌లో తొలిసారిగా స్టాండర్డ్ గ్లాస్ వీటి తయారీ, విక్రయాలను చేపడుతోందని సంస్థ ఎండీ నాగేశ్వర రావు తెలిపారు. ఏజీఐ, జీఎల్ హక్కోతో కుదుర్చుకున్న ఒప్పందం తమకే కాకుండా భారత ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు ఎంతో మేలు చేకూర్చనుందన్నారు. గ్లాస్‌లైన్డ్ షెల్, హీట్ ఎక్స్ఛేంజర్స్‌కు అంతర్జాతీయంగా 200 కోట్ల డాలర్ల మార్కెట్ ఉండగా.. ఒక్క భారత్‌లోనే రూ.2,000 కోట్ల మార్కెట్ ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం నాటికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ప్లాంట్‌లో ప్రతి నెల 200 యూనిట్ల సామర్థ్యంతో ఈ ఉత్పత్తుల తయారీని చేపట్టాలని చూస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు.





## విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**

వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే అద్భుత విజయాలు సాధించి, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు.వనపర్తి మండలం,కిష్ట గిరి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆంజనేయులు కుమార్తె నవ్య పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించడంతో గురువారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నవ్య ను సన్మానించి అభినందించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో ఉర్కొండ పెట్ ఎం జె బి స్కూల్ సెకండ్ గా 557 మార్కులు రావడం జరిగింది.ఇట్టి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించడం జరిగింది.భవిష్యత్తులో మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.లక్ష్యాన్ని నిర్ణయించుకొని కృషిచేస్తే జీవితం లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివి దేశ,విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారి ఉదాహరణలు గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ధర్మ నాయక్ వెంకటయ్య,మాజీ సర్పంచ్ కొండయ్య, చిట్యాల రాము,అంజి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక

గ్రామ శాఖ అధ్యక్షుడిగా షేక్ జహూర్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మధిర నియోజకవర్గం చింతకాని మండలం వందనం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు గ్రామ తెదేపా సీనియర్ నాయకులు షేక్ అమీన్ సాహెబ్ అధ్యక్షతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన అధ్యక్షుడిగా షేక్ జహూర్, ఉపాధ్యక్షుడిగా షేక్ అమీన్ సాహెబ్, జనరల్ సెక్రెటరీగా కొండా దుర్గా శంకర్, ట్రెజరీగా కొండా శిరీష ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నిక అనంతరం షేక్ జహూర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ కోసం కలిసికట్టుగా పనిచేయాలని , పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేటి పర్యటన వివరాలు

షాద్‌నగర్, తెలంగాణ ముచ్చట్లు:



షాద్‌నగర్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేడు పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఉదయం 8:30 గంటలకు షాద్‌నగర్ పట్టణంలోని సి.ఎస్.కె. విల్లాస్ వెనుక ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్ వద్ద నిర్మించిన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అనంతరం ఉదయం 8:45 గంటలకు 8వ వార్డులోని ఆర్టీసీ కాలనీ పార్క్‌లో చిన్నపిల్లల ఆట వస్తువుల ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు.

తర్వాత ఉదయం 9:20 గంటలకు ఫరూఖ్‌నగర్ మండలంలోని అన్నారం గ్రామంలో నిర్వహిస్తున్న "జై బాపు, జై భీం, జై సంవిధాన్" యాత్రలో పాల్గొననున్నారు. ప్రజల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే శంకర్ ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారు.



## కలెక్టర్ చేతుల మీదుగా మైనార్టీ గురుకుల అడ్మిషన్ పోస్టర్ ఆవిష్కరణ

,హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:

హన్మకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రావీణ్య గారు బుధవారం తాను కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలల అడ్మిషన్లకు సంబంధించిన ప్రచార పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. హన్మకొండ జిల్లాలో మొత్తం మూడు బాలుర గురుకుల పాఠశాలలు మరియు ఒక బాలికల గురుకుల పాఠశాల ఉన్నాయని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఎండబ్ల్యూ మురళీధర్ రెడ్డి, ఆర్ఎల్సీ శ్రీనివాస్ తనుగుల, గురుకుల ప్రిన్సిపాళ్లు సతీష్, నీరజ తదితరులు పాల్గొన్నారు ,

# జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేయాలి...

- **రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు.**
- **80 శాతానికి పైగా పనులు పూర్తి.**
- **గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి తుమ్మల.**

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

జులై 15 కల్లా ఖమ్మందేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, అధికారులతో కలిసి వేంసూరు నుండి ధాంసలాపురం వరకు ఖమ్మందేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే గుండా ప్రయాణిస్తూ, క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జిల్లాలో 3 ప్యాకేజులుగా విభజించి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పనులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, సమస్యలు గురించి తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. జులై 15 కల్లా పూర్తిస్థాయిలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు.

ప్యాజేజి1 క్రింద తల్లంపాడు నుండి సోమవరం వరకు 30 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం రూ. 772.11 కోట్ల అంచనాలతో చేపట్టగా, 75 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఇట్టి ప్యాకేజీలో 32 స్ట్రక్చర్లు ఉండగా, 29 పూర్తయ్యాయని తెలిపారు. ధాంసలాపురం వద్ద ఎన్ఎస్పి కాల్వలో పిల్లర్ల విషయమై అలైన్మెంట్ లో కాస్త ఆలస్యం అవగా, ప్రస్తుతం పనులు వడివడిగా సాగుతున్నాయన్నారు.

ప్యాకేజి2 క్రింద సోమవరం నుండి చింతగూడెం వరకు 27 కి.మీ. మేర రూ. 637.11 కోట్ల అంచనాలతో పనులు చేపట్టినట్లు, ఇప్పటివరకు 81 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇట్టి ప్యాకేజీలో 39 స్ట్రక్చర్లకు గాను 35 నిర్మాణాలు పూర్తయినట్లు ఆయన అన్నారు. ప్యాకేజి3 క్రింద చింతగూడెం నుండి రేచర్ల వరకు 38 కి.మీ. మేర రూ. 804.69 కోట్ల వ్యయ అంచనాలతో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 85 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఈ ప్యాకేజి కి సంబంధించి 55 స్ట్రక్చర్లు ఉండగా, 51 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు.

పనుల పురోగతికి ఎటువంటి సమస్యలు లేవని, అన్ని ప్యాకేజీలలో పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీస్ రోడ్ విషయమై ప్రతిపాదనలు సమర్పించి, మంజూరు చేయిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంత మంత వ్యవసాయ ప్రాంతం కావున, సర్వీస్ రోడ్ చాలా అవసరమని మంత్రి అన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే లో సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 3 ఎక్జిట్లు ఉన్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలోని నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే లో 3 ఎక్జిట్లు లేవని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం ఎంతో ఆదా అవుతుందని, రవాణా వ్యవస్థ మెరుగవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పిడి దివ్య, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పలు అభివృద్ధి, నిర్మాణ పనులకు ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:

జిల్లాలో పలు అభివృద్ధి, నిర్మాణాల పనులకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్, రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. ప్రభుత్వం చేపట్టే నూతన నిర్మాణాలకు స్థల సేకరణ కోసం పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. టిటిడి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం కోసం పువ్వాడ ఉదయ్ నగర్ గుట్ట పైకి ఎక్కి అనువైన స్థలం, రహదారికి మార్గాలను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జింకలతండా, పువ్వాడ ఉదయ్ నగర్ ల పూర్తిస్థాయి స్థలాల మ్యాప్ లను సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ విల్సన్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.





## ఇందిరమ్మ ఇండ్లకు బిల్లుల ఆపివేతపై బీజేపీ నేతల ఆవేదన

వేలేరు, తెలంగాణ ముచ్చట్లు:

వేలేరు మండలం శాలపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మితమవుతున్న ఇందిరమ్మ ఇండ్లలో 400 నుంచి 600 చదరపు అడుగుల స్థలంలో నిర్మిస్తున్న కుటుంబాలకు తొలి దశ బిల్లులు విడుదలయ్యాయి. అయితే పేద ఉమ్మడి కుటుంబాలు, పెద్ద కుటుంబాలు ప్రభుత్వ సహాయంతో పాటు స్వకృషితో కొద్దిగా పెద్దగా ఇండ్లు నిర్మించుకుంటుండగా, వారికి మాత్రం బిల్లులు ఆపివేయడం జరిగిందని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, అలాంటి కుటుంబాలను మానవత్వపు కోణంలో పరిశీలించి ప్రభుత్వ నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌ను కోరినట్టు బీజేపీ వేలేరు మండల అధ్యక్షుడు కె. రాజు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మండల రవి, మండల నాయకుడు కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికి తప్పక అవకాశాలు లభిస్తాయి

- **స్టేషన్ ఘనపూర్‌లో విస్తృత స్థాయి కాంగ్రెస్ సమావేశం**
- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:



కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల కోసం పని చేసే పార్టీ అని, పార్టీకి నిస్వార్థంగా సేవలందించే ప్రతి కార్యకర్తకూ సరైన సమయంలో తగిన అవకాశాలు లభిస్తాయని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈ సమావేశానికి జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించగా, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అహ్మద్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ, పార్టీ బలోపేతం పైనే తన దృష్టి నిండుగా ఉండి, పదవుల విషయంలో తనకు ఎలాంటి వ్యక్తిగత ఆకాంక్షలు లేవని స్పష్టం చేశారు. పైరవీలకు చోటులేని కాంగ్రెస్‌లో సమర్థత, సీనియార్టీ ఆధారంగానే నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా తన చర్యలు కొనసాగుతాయని, ప్రజల మద్దతుతో నియోజకవర్గంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే తన ఏజెండా అని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధి విషయానికి వస్తే, గతంలో బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు ఒక్క ఇల్లు కూడా మంజూరుకాకపోగా, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఏడాది వ్యవధిలోనే 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. మొదటి దశలో ఇండ్లు రాని అర్హులకు రెండో దశలో ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబుపేట ప్రధాన కాలువకు సీసీ లైనింగ్ ఏర్పాటుకు రూ.148 కోట్లు, మల్లన్నగండి ఎత్తిపోతల పథకానికి రూ.104 కోట్లు మంజూరు చేయించామని వివరించారు. త్వరలోనే ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని, ఎగువ ప్రాంతాలైన చిల్పూర్, వేలేరు మండలాల్లో సాగునీరు అందేలా చూస్తామని తెలిపారు. రఘునాథపల్లి, లింగాల, గణపురం మండలాలకు అశ్వరావుపల్లి కుడికాలువ ద్వారా సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.

రైతుల కోసం మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం ద్వారా రైతుబంధవత్మను చాటామని, పేదల ఆకలి తీర్చే ఉద్దేశంతో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి జరగాలన్నదే తన కసిగా ఉందని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తీసుకురావడం, రెవెన్యూ ఆఫీసు కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడం కూడా ఈ దిశగానే సాగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్, మండల అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, దేవాలయ కమిటీలు, సమన్వయ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం-16- మే 2025






# దొంగే... దొంగ దొంగ అన్నట్టుంది మాజీ మంత్రి వ్యవహారం

- అన్నదాతల అవస్థలకు కారణం బిఆర్ఎస్ పార్టీనే
- మిషన్లు లేని రేకుల షెడ్డుకు రైస్ మిల్లు అని అనుమతులు ఇచ్చిన ఘనత మీది
- 150 రైస్ మిల్లులు నేడు బ్లాక్ లిస్టులో ఉన్నాయంటే ఆ పాపం మీది కాదా!
- వనపర్తి కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పెబ్బేరు మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి,ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి,పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్,పెద్దమందడి మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి,పెబ్బేరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య శీలా రెడ్డి, పెబ్బేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకట్రాములు,శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరి రాజు,వనపర్తి మండల అధ్యక్షులు రవికిరణ్, ఖిల్లా ఘణపురం మండల నాయకులు రవినాయక్,యుగంధర్ రెడ్డి లు పాల్గొని మాట్లాడారు.వరి ధాన్యం కొనుగోళ్లపై మాజీ మంత్రి మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందని గత పదేళ్లుగా ఇష్టానుసారంగా వ్యవహరించి 150రైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో చేర్చిన ఘనత మాజీ మంత్రిదేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.నేడు వనపర్తి జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పనులు ఎంతో చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు.300 లారీలతో నిత్యం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల సేకరణ జరుగుతుందన్నారు.200ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు.బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన వనపర్తి మార్కెట్ యార్డులో వర్షపు నీరు నిలవడానికి కారకులు ఎవరు కమిషన్లు కక్కుర్తి పడిఇష్టానుసారంగా పనులు చేసిన మీరు నేడు నీతులు చెప్పడం హాస్యాస్పదం.ఏసీ రూముల్లో కూసోని ప్రెస్ నోట్లు రిలీజ్ చేయడం కంటే నిజ నిజాలను అధికారుల వద్ద తెలుసుకొని ప్రెస్ నోట్ రిలీజ్ చేస్తే బాగుంటుందని మేం సూచిస్తున్నాం.హమాలీల ఇబ్బంది ఉన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొంతమంది హమాలీలను సొంతంగా ఏర్పాటు చేసి రైతులకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నామని అన్నారు.రైతులందరూ సంతోషంగా ఉన్న రైతుల ముసుగు తొడుక్కున్న కొందరు బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ని అబాసు పాలు చేయాలన్న ఉద్దేశంతో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు.అన్నదాతల గురించి ఆపసోపాలు పడే నాయకులు అవసరమైతే సమస్యల పరిష్కారానికి తగిన సలహాలు సూచనలు ఇస్తే బాగుంటుందని అవి చేయకపోగా ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయాలన్న ఉద్దేశంతో లేనిపోనివి సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తూ పైశాచిక ఆనందం పొందడం బాగుండదని వారు హెచ్చరించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో సన్నరకం వడ్లకు ప్రభుత్వం బోనస్ ఇస్తోందని దీంతో నిజమైన రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వారు పేర్కొన్నారు.జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షిస్తున్నారని అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సైతం చివరి గింజ వరకు కొనుగోలు చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి గారు నిత్యం కృషి చేస్తున్నారని వారు పేర్కొన్నారు.నాడు వరివేస్తే ఉరి అన్న పరిస్థితుల నుంచి నేడు వరి వేస్తే 'సిరీ' అనే విధంగా పరిస్థితులు మారాయని వారన్నారు.యూరియా కోసం రైతులు క్యూ లైన్ లలో నిలబడి చనిపోతే సినిమా హాళ్ల ముందు లైన్లో నిలబడి చనిపోతే సినిమా హాలు వాడిదా తప్పు, మీటింగ్ వచ్చిన రైతు చనిపోతే మీటింగ్ వారిదా తప్పు అని రైతులను అవమానపరిచిన మీరు నేడు నీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రపంచ సుందరీమణుల మీద ఉన్న ధ్యాస రైతుల మీద లేదు అన్న మాజీ మంత్రి.ప్రపంచ సుందరీమణులకు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్ ను ప్రశంసించపోగా విమర్శించడం పట్ల మీకుచ్చిత బుద్ధి ప్రజలకు అర్థమవుతుంది.రైతు సమస్యలకు అందాల పోటీలకు లింకు పెట్టి మాట్లాడే మీరు మీ వక్రబుద్ధిని చూపించారు.మహిళలను కించపరిచి మెట్టు దెబ్బలు తిన్నవారు.సినీ తారల కుటుంబాలలో చిచ్చుపెట్టి కూల్చిన వారు మీరు అన్న సంగతి మర్చిపోకండి.అన్నదాతలు ఆనందంగా పంటను విక్రయిస్తుంటే చూసి ఓర్వలేని మీలాంటి మాజీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి ధర్నాలు చేయించడం మానుకొని వీలైతే రైతు సమస్యల పరిష్కారానికి సహకరించాలన్నారు.

# ఈ నెల 25 యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష

- జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**



యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో మే 25న జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ కోసం హనుమకొండ జిల్లా పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. యుపిఎస్సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను 4141 మంది అభ్యర్థులు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందన్నారు.

మొదటి సెషన్ పరీక్ష మే 25న ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు, రెండో సెషన్ లో పరీక్ష మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందుగానే చేరుకోవాలన్నారు.

ఉదయం 9 తర్వాత, మధ్యాహ్నం 2 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోని కి అనుమతించరని పేర్కొన్నారు.

అభ్యర్థులు అడ్మిట్ కార్డు తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డులలో ఏదైన ఒక కార్డును వెంట తెచ్చుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు.

పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డు తో పాటు పెన్ను, పెన్సిల్ను వెంట తెచ్చుకోవాలన్నారు చేతి గడియారాలు కూడా అనుమతించబడవని అన్నారు. యుపిఎస్సి ప్రిలిమినరీ పరీక్షలు ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉదయం 6 గంటల నుండి పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తను అందుబాటులో ఉంచి అవసరార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలన్నారు. యూపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే రోజున ఆర్టీసీ బస్సులు ఉదయం 7 గంటల నుండి ప్రారంభమవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి, డీఈఓ వాసంతి, టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్ రావు, తహసీల్దార్లు, పరీక్షా కేంద్రాల సూపర్వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

- తహశీల్దార్లు పున్నంచందర్, రాంబాబు లు.
- బోనకల్ మండలం ఆళ్లపాడు, చిన్నబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు ఏ. పున్నం చందర్, ఆర్. రాంబాబు లు అన్నారు. మంగళవారం బోనకల్ మండలం ఆళ్లపాడు, చిన్నబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతిలో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆళ్లపాడు గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 185, చిన్నబీరవల్లి గ్రామ రెవెన్యూ సదస్సులో 141 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఆర్ఐలు నవీన్, మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మాస్టర్ ప్లాన్ త్వరలో ఆమోదం ....

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్ లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

నగరం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేసి ప్రభుత్వంచే ఆమోదింప చేసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

గురువారం మంత్రి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్ లో టి.యు.ఎఫ్.ఐ. డి.సి. నిధులు 72 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెవెన్యూ సంబంధించిన భూ సమస్యల అంశాలను అదనపు కలెక్టర్, మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలను కమీషనర్ బాధ్యత తీసుకొని పరిష్కరించాలని అన్నారు.

ఖమ్మం నగర అభివృద్ధి మాస్టర్ ప్లాన్ త్వరలోనే ఆమోదించడం జరుగుతుందని, ఫైనల్ చేసే ముందు ప్రజాప్రతినిధులను సంప్రదిస్తామని అన్నారు. ఖమ్మం మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందిన తర్వాత పెండింగ్ భవన నిర్మాణాలు అనుమతులు త్వరగా జారీ చేయాలని అన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని అదనపు కలెక్టర్ కు సూచించారు. నగర అభివృద్ధికి మనమంతా సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. నగరంలో పేద ప్రజలకు మధ్య తరగతి వారికి ఏం కావాలో ఒక్కొక్కటిగా పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని, ప్రశాంతమైన ప్రగతి సాధించిన ఖమ్మంను తయారు చేస్తామని అన్నారు.

పేదలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని రకాల హామీలను అమలు చేస్తూ అభివృద్ధి పనులను కూడా ఎక్కడ వెనకాడకుండా పూర్తి చేస్తామని అన్నారు.

ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేశామని, వచ్చే వారం నాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 58 ప్రకారం పట్టాలు సంబంధించి రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుంటూ వెరిఫికేషన్ చేస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత ప్రత్యేక రెవెన్యూ క్యాంపెయిన్ నిర్వహించి అర్హులకు ఇంటి పట్టాలు, హౌస్ నెంబర్ కేటాయిస్తామని అన్నారు.

ప్రభుత్వ భూముల సంరక్షణకు కూడా కోర్టు ఆదేశాల ప్రకారం ఏడి సర్వే అండ్ ల్యాండ్ అధికారులతో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురైనట్లు సమాచారం అందిందని, రేపటి వరకు దానిని స్వాధీనం చేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పూనుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతీమా జోహారా, స్థానిక కార్పొరేటర్ ప్రశాంతి లక్ష్మి, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యం..!




రుణ గ్రహీతలపై హెచ్చు వడ్డీ రేట్ల భారాన్ని తగ్గించడానికి సమయం ఆసన్నమయ్యింది. ఇటీవల కాలంలో ద్రవ్యోల్బణం సూచీ తగ్గుముఖం పట్టడంతో వడ్డీ రేట్లకు కోత పెట్టడానికి వీలుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం దాదాపు ఆరేళ్ల కనిష్టానికి పడిపోయింది. సాధారణంగా అల్ప స్థాయిలో ద్రవ్యోల్బణం, తక్కువ వడ్డీ రేట్లు జిడిపి వృద్ధికి మద్దతును అందిస్తాయి. దీంతో ప్రజల వద్ద ఆదాయాలు పెరగడంతో కొనుగోళ్లకు మద్దతు లభించనుంది. ఈ నేపథ్యంలో వడ్డీ రేట్ల తగ్గింపు అనివార్యమని నిపుణులు సూచిస్తున్నారు. బుధవారం కేంద్ర గణంకాల శాఖ విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఏప్రిల్‌లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.16 శాతానికి దిగివచ్చింది. ఇది 2019 జులై నాటి కనిష్ట స్థాయి. మరోవైపు టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) తగ్గింది. గడిచిన ఏప్రిల్‌లో డబ్ల్యుపిఐ 0.85 శాతానికి పరిమితమై 13 నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం నెలలో ఇది 2.05 శాతంగా చోటు చేసుకుంది. ముఖ్యంగా అహర ఉత్పత్తుల ధరలు దిగిరావడమే ఇందుకు కారణం. మార్చిలో 4.66 శాతంగా ఉన్న అహారోత్పత్తుల ద్రవ్యోల్బణం, ఏప్రిల్‌లో 2.55 శాతానికి తగ్గింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 3.07 శాతం నుంచి 2.62 శాతానికి దిగివచ్చింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం ఏకంగా 0.20 శాతం నుంచి మైనస్ 2.18 శాతానికి పడిపోవడం విశేషం. ద్రవ్యోల్బణం ఆధారంగానే ఆర్‌బిఐ వడ్డీ రేట్లలో మార్పులు చేస్తుంది. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం దిగిరావడంతో ఆర్‌బిఐ ఎంపిసి ద్రవ్య సమీక్షల్లో రెపోరేటు మరింత దిగిరానుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును పావు శాతం లేదా 25 బేసిస్ పాయింట్లు చొప్పున మొత్తం అర శాతం తగ్గించింది. ఫలితంగా ఎట్టకేలకు రెపో రేటు 6 శాతానికి దిగివచ్చింది. దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినందున రిజర్వు బ్యాంక్ వడ్డీ రేట్లను భారీగా తగ్గించడానికి వీలుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ ఇటీవల పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3 శాతం దిగువకు తగ్గొచ్చని తెలిపింది. ఇదే పరిస్థితి కొనసాగితే వడ్డీ రేట్లను 125 బేసిస్ పాయింట్లు (1.25 శాతం) తగ్గించడానికి వీలుందని పేర్కొంది. జూన్‌ఆగస్టు సమయంలో 75 బేసిస్ పాయింట్లు వడ్డీ రేట్ల తగ్గింపును అంచనా వేస్తున్నాము. ద్వితీయార్థంలో మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గించడానికి వీలుందని పేర్కొంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు...



డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్‌పాకిస్తాన్ వివాదంలో అనవసర జోక్యం, ధనిక దేశంగా లేదా సైనికశక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది. ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగిజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను వాడుకునే దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బతీశారు. యూరోపియన్ మిత్రదేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే ఉచిత సవారీదారులు అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌ను లిటిల్ రాకెట్ మాన్ అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్‌ను గందరగోళానికి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించకపోగా మిత్రదేశాలను దూరం చేసింది. ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. ఎక్స్‌లోని పోస్టులు ట్రంప్‌ను హిందీ సినిమాలో విలన్‌తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'అమెరికా గొప్పతనం' ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయింది. ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి. కశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోడీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. భారత్ ప్రభుత్వం ఈ వాదనను ఖండిరచింది. ఇటీవల 2025 మేలో భారత్ ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్ ప్రతిస్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తిగా ప్రజలు అనుకుంటున్నారు. ఆయన మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడోపక్ష మధ్యవర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది. ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కశ్మీర్ సమస్యను పరిష్కరిస్తాను అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్‌కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. 'ఎక్స్'లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏదిపడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు.

ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమే. భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనికశక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంతమాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు. అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది. అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే. చిన్నదేశం అయినా, పెద్దదేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించకపోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా పెద్దన్న నాయకత్వ హోదాపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ట్రంప్ సుంకాల విధానాలు దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్‌లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ అమెరికా ఫస్ట్ విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదంగా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బందిపెడుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పగా చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు. అయితే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ విడ్డూరంగా ఉండకూడదు. ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి. ఆయన ప్రవర్తనతో అమెరికా కు శత్రువులను పెంచుతుంది. మిత్రదేశాలు మధ్య విభజన జరుగుతుంది. ట్రంప్ దౌత్యవైఫల్యాలు ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్ పాకిస్తాన్ ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వంపట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కశ్మీర్ విషయంలో పూర్వచరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థికశక్తి, ఆయుధ శక్తితోనే పెద్దరికం రాదు. ఆయన మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బలప్రదర్శన, ఒత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవపరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం, మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలి అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయంతో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.

## ట్రంప్‌తో భేటీ అయిన ముకేశ్ అంబానీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఆసియా అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ భేటీ అయ్యారు. అరబ్ దేశాల పర్యటనలో ఉన్న ట్రంప్ (Donald Trump).. ఖతార్ చేరుకున్నారు. అగ్రరాజ్యాధినేత కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రభుత్వ విందు ఏర్పాటుచేశారు. ఈ విందుకు ముకేశ్ అంబానీ (Mukesh Ambani) కూడా హాజరయ్యారు. ఈసందర్భంగా ట్రంప్‌తో ఆయన సమావేశమయ్యారు. విందుకు హాజరైన అంబానీని ట్రంప్, ఖతార్ ఎమిర్ సాదరంగా ఆహ్వానించారు. ఇక, రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం ట్రంప్‌ను అంబానీ కలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో 100 మందికి ఇచ్చిన ప్రత్యేక విందులో నీతాముకేశ్ అంబానీ పాల్గొన్న సంగతి తెలిసిందే. కాగా.. అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలతో రిలయన్స్ వ్యాపారాలకు (Reliance Industries) కనెక్షన్ ఉంది. గతేడాది వెనెజువెలా నుంచి ముడిచమురు దిగుమతిని పునః ప్రారంభించడానికి అమెరికా నుంచి రిలయన్స్ మినహాయింపులు పొందింది. అయితే వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 25% టారిఫ్‌ను ట్రంప్ విధించడంతో ఆ దిగుమతి ఆగిపోయింది. రష్యా నుంచి ముడిచమురును రిలయన్స్ దిగుమతి చేసుకొని, పెట్రోలు వంటి ఇంధనాలు తయారుచేసి వాటిని అమెరికాకు విక్రయిస్తోంది. గూగుల్, మెటా వంటి అమెరికా దిగ్గజాలకు రిలయన్స్ జియోలో వాటాలున్నాయి. ఖతార్‌తోనూ రిలయన్స్‌కు వ్యాపార సంబంధాలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌అంబానీ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విందుకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా హాజరయ్యారు. అయితే, ఆయన 30 నిమిషాలు ఆలస్యంగా వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, న్యూస్‌మ్యాక్స్ వ్యవస్థాపకుడు క్రిస్ రూడీ, బ్లాక్‌స్టోన్ సీఈఓ స్టీఫెన్ తదితర వ్యాపార ప్రముఖులు ఈ విందులో పాల్గొన్నారు.

## 2035 నాటికి రోడ్లపై డ్రైవర్‌లెస్ కార్లే: టెస్లా ఏఐ సాఫ్ట్‌వేర్ బాస్

విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా (Tesla) ఏఐ సాఫ్ట్‌వేర్ వైస్ ప్రెసిడెంట్‌గా భారత సంతతికి చెందిన అశోక్ ఎల్లుస్వామి పనిచేస్తున్న విషయం తెలిసిందే. కంపెనీలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన టెస్లా పనితీరు, ఎలాన్ మస్క్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. తాజాగా ఓ యూట్యూబర్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆయన మస్క్‌తో కలిసి పనిచేయడం చాలా సరదాగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

"ప్రస్తుతం కారు నడపాలంటే డ్రైవర్లపై ఆధారపడుతున్నాం. భవిష్యత్తులో టెక్నాలజీనే వాటన్నింటినీ చూసుకుంటుంది. 2035 నాటికి అన్నీ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లే తయారవుతాయి. రానున్న దశాబ్దం నాటికి రోడ్లపై అన్నీ ఈతరహా కార్లే చక్కర్లు కొడతాయి. భవిష్యత్తులో ఒకవేళ మీకు కారు నడపడం ఇష్టంగా ఉంటే పాత రకం కారును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. డ్రైవర్ లెస్ కార్లదే భవిష్యత్తు" అని అశోక్ ఎల్లుస్వామి తెలిపారు. అమెరికాలోని కొన్ని నగరాల్లో టెస్లా డ్రైవర్‌లెస్ కార్లను ప్రారంభించాలని చూస్తున్నామన్నారు. అన్ని కార్లూ ఒకే ఏఐ సాంకేతితకతో పనిచేస్తాయని పేర్కొన్నారు. మస్క్‌తో కలసి పనిచేసిన అనుభవం గురించి ఎల్లుస్వామి మాట్లాడుతూ.. రిస్క్ తీసుకోవడానికి టెస్లా అధినేత ఎప్పుడూ వెనకడుగు వేయరన్నారు. "మస్క్ చాలా తెలివైనవారు. భవిష్యత్తును ముందుగానే అంచనా వేయగలరు. చాలా కష్టపడి పనిచేస్తారు. వారానికి 8090 గంటలు శ్రమిస్తారు. ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా" అని అన్నారు. మస్క్ చాలా సరదాగా ఉంటారని తెలిపారు. ఆయన దూరదృష్టి సాటిలేనిదన్నారు. ఈ బిలియనీర్ పనితీరు, సాంకేతికతపై పట్టు కంపెనీ విజయానికి కారణమన్నారు. టెస్లా ఆటోపైలట్ బృందంలో చేరిన మొదటి వ్యక్తి అశోక్ ఎల్లుస్వామి. కృత్రిమ మేధ, ఆటోపైలట్ సాఫ్ట్‌వేర్‌లో టెస్లా సాధించిన విజయంలో అశోక్ కీలక పాత్ర పోషించారు. ఈ విషయంపై ఎలాన్ మస్క్ అశోక్, అతని బృందానికి కృతజ్ఞతలు తెలిపిన విషయం తెలిసిందే.

# ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి





తూర్పున ఉదయించే కాంతి రేఖలు మనకు ప్రతీ రోజూ నవశకానికి స్వాగతం పలుకుతుంది. తూర్పు దిక్కున అరుణారుణ కాంతులు మెల్లగా వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి రమణీయమైన దృశ్యం మాత్రమే కాదుబీ మానవజాతి అనంతమైన ప్రగతి పథానికి అది శుభసూచకం. కాంతి కేవలం ఒక భౌతిక దృగ్విషయం మాత్రమే కాదు. ఇది నూతన ఆలోచనలకు, ఊహలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరినిచ్చే ఒక అక్షయ శక్తి. కాంతి, ఈ విశ్వంలోని ప్రాథమిక శక్తి, కేవలం మన కంటికి గోచరించే ప్రకాశం కాదు. ఇది శాస్త్ర, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, సమాచార, పర్యావరణ రంగాలలో ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, పేదరికం, అసమానత్వం, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి పెను సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కాంతి ఆధారిత సాంకేతికతలు ఒక దిక్సూచిలా, ఒక ఆశాకిరణంలా పని చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి ప్రాముఖ్యతను మరింత లోతుగా గుర్తుచేస్తుంది. 2025వ సంవత్సరం థీమ్ అయిన 'కాంతి, ఆవిష్కరణ, సమాజం' అనేది ఈ ప్రాముఖ్యతను మరింతగా విశదీకరిస్తుంది. కాంతి బహుముఖ ప్రజ్ఞను మన ముందుంచుతుంది. ఈ థీమ్ శాస్త్రీయ పరిశోధనల పురోగతి, సాంకేతిక ఆవిష్కరణల విశిష్టత, సమాజ సమగ్ర శ్రేయస్సును పెంపొందించడంలో కాంతి ఆధారిత సాంకేతికతల అనితరసాధ్యమైన పాత్రను నొక్కి చెబుతుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన ప్రజలను %% శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కాంతి శాస్త్రం, సాంకేతికత యునెస్కో లక్ష్యాలైన శాంతి, సమానత్వం, విద్యను ఎలా సాధించగలదో తెలిపే విభిన్న కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనమని స్ఫూర్తినిస్తుంది, ప్రోత్సహిస్తుంది.

కేవలం ఒక శతాబ్దం క్రితం ఊహించలేని లేజర్ల ఆవిష్కరణ నుండి నేటి అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు అద్భుతమైన విజయాలకు, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సంవత్సరంతో కూడా అనుసంధానించబడి ఉండటం, ఈ అంశం సమకాలీన ప్రాముఖ్యతను మరింతగా చాటుతోంది. నేడు మానవ సమాజం అనేక సంక్లిష్టమైన, అంతర్లీన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రపరిణామాలు, ఆరోగ్య సంరక్షణలో అంతరాలు అసమానతలు, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడంలో ఉన్న అవరోధాలు కొన్ని ముఖ్యమైనవి. ఈ క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా స్థిరంగా అధిగమించడానికి కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఒక శక్తివంతమైన సాధనంగా, ఒక ఆశాజనకమైన మార్గంగా ఆవిర్భవిస్తున్నాయి. శక్తిని మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేయడానికి వినియోగించడానికి నూతన, పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు నిరంతరం అభివృద్ధి చేయబడుతున్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి ప్రాథమిక రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతల అనువర్తనాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ రంగంలో 'అగ్రిఫోటోనిక్స్' ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం, నీటి వినియోగాన్ని హేతుబద్ధీకరించడం, హానికరమైన తెగుళ్ళను పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు కచ్చితమైన లేజర్ ఆధారిత చికిత్సా విధానాలు వ్యాధులను మరింత ముందుగా మరింత కచ్చితంగా గుర్తించడానికి సమర్థవంతంగా నయం చేయడానికి సహాయపడుతున్నాయి. ఇది రోగుల వేగవంతమైన పునరుద్ధరణకు దోహదం చేస్తోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, కాంతి వేగంతో అపారమైన సమాచారాన్ని క్షణాల్లో చేరవేసే ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యా రంగంలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనా పద్ధతులను మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా తద్వారా మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి. ఈ స్ఫూర్తిదాయకమైన అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి అపారమైన శక్తిని దాని ఆధారిత సాంకేతికతల విశిష్టమైన ప్రాముఖ్యతను మన మందరం గుర్తెరుగుదాం. ముఖ్యమైన ఆవిష్కరణలు కేవలం ఉన్నత స్థాయి శాస్త్రీయ ప్రయోగశాలలకు లేదా ప్రత్యేక పరిశోధనా సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. వాటి విస్తృత ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్య సంరక్షణ స్థిరమైన అభివృద్ధి వంటి కీలక రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, మనం మరింత సమతా పూర్వకమైన, అభివృద్ధి చెందిన మానవీయ విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించగలము. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు విధాన రూపకర్తలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కలిసి పనిచేసి, కాంతిని మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకునే మార్గాలను అన్వేషిద్దాం. తద్వారా, మనం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలము. కాంతిని ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, సమాజానికి వెలుగు దివ్వెగా నిలుపుదాం. ఈ కాంతి ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, ప్రయత్నాలు భాగస్వామ్యం అమూల్యమైనవి. కలిసి సాగుదాం, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.



# రాగిజావ రోజూ తాగుతున్నారా..?

ప్రతిరోజూ రాగిజావను తీసుకోవచ్చు. అయితే దీనికంటూ ఓ టైమ్ ఫిక్స్ చేసుకోవాలి. ఎప్పుడుపడితే అప్పుడు తాగటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. రాగి జావను ఉదయం తీసుకుంటే చాలా మంచిది. కానీ రాత్రిపూట తీసుకోవడం మంచిది కాదని సూచిస్తున్నారు. అలాగే, మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉంటే మంచిదని అంటున్నారు. రోజూ రాగిజావ తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. మంచి పోషకాలను కలిగి ఉంటుంది. విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్‌లు, ఫైబర్‌లు, కొవ్వులు, ప్రొటీన్‌ల వంటి అన్ని అవసరమైన స్థూలపోషకాలను కలిగి ఉంటుంది. ప్రతిరోజూ రాగిజావను తీసుకోవచ్చు. అయితే దీనికంటూ ఓ టైమ్ ఫిక్స్ చేసుకోవాలి. ఎప్పుడుపడితే అప్పుడు తాగటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. రాగి జావను ఉదయం తీసుకుంటే చాలా మంచిది. కానీ రాత్రి పూట తీసుకోవడం మంచిది కాదని సూచిస్తున్నారు.ఇక మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు రాగిజావకు దూరంగా ఉంటేనే మంచిది. బరువు పెరగాలనుకునేవారు రాగి జావను ఎక్కువగా తీసుకోవద్దు. కొంచెంగా తీసుకోవచ్చు. ఎందుకంటే రాగజావ వినియోగంతో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. రాగి జావ అధిక వినియోగం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, డయేరియా వచ్చే అవకాశముంది. కొందరికి దీని వల్ల కొందరిలో అలర్జీ వంటివి కూడా రావొచ్చు. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు రాగులు తినకపోవటం మంచిది. రాగిలో థైరాయిడ్ గ్రంథి సాధారణ పనితీరుకు ఆటంకం కలిగించే గోయిట్రోజెన్‌లతో నిండి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, రాగి జావ ఎక్కువగా తీసుకోవటం వల్ల కడుపు ఉబ్బరం, గ్యాస్, డయేరియా వంటి సమస్యలు వచ్చే అవకాశముందని చెబుతున్నారు. అలాగే, మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు కూడా దీనికి దూరంగా ఉంటే మంచిదని అంటున్నారు.



# మామిడి పళ్లతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు

మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. పండ్లలో రారాజు మామిడి.. వేసవి కోసం అందరూ ఎదురు చూసేది మామిడి పండ్ల కోసమే అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సమ్మర్ స్పెషల్ మామిడి పండ్లు కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా శరీరానికి కూడా అనేక ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. మామిడి పండ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. మామిడి పండ్లతో జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. మామిడి పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది ఉబ్బరం, మలబద్ధకం, అజీర్ణం వంటి జీర్ణ రుగ్మతల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మామిడి పండ్లు తినటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్ వ్యాధులు దరిచేరకుండా శరీరానికి మంచి ఇమ్యూనిటి పవర్‌లా పనిచేస్తుంది. మామిడి పండ్లలో ఉండే విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచి ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. మామిడి పండ్లలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడానికి మరియు ఆరోగ్యకరమైన హృదయనాళ వ్యవస్థకు తోడ్పడతాయి. అంతేకాదు.. మామిడి పండ్లలో విటమిన్ ఎ ఉంటుంది. ఇది కంటి చూపుకు మేలు చేస్తుంది. మంచి దృష్టికి విటమిన్ ఎ అవసరం. వయస్సు సంబంధిత కంటి వ్యాధులను నివారించడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. మామిడి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇది ఫ్రీ రాడికల్స్ ప్రభావాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. చర్మ కణాలు దెబ్బతినకుండా నివారిస్తుంది. మామిడి పండ్లలో ఉండే ఫైబర్ కంటెంట్ మిమ్మల్ని ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉంచడంలో సహాయ పడుతుంది. అయితే, మామిడి పండ్లను ఎల్లప్పుడూ మితంగా తినాలి.

# ఎప్పుడు పడితే అప్పుడు పెరుగు తింటే..

వ్యాయామం వల్ల అధికంగా చెమట పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే పెరుగు తింటే జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయి. ఉదయాన్నే ఓ కప్పు పెరుగు తింటే మెటబాలిజం పెరుగుతుంది. ఎనర్జీగా ఉంటారు. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణశక్తిని పెంచి గట్ హెల్త్‌ని కాపాడుతుంది. ఇందుకోసం హోల్ గ్రెయిన్స్, సెరల్స్‌తో కలిపి తీసుకోవచ్చు. పెరుగును ఎప్పుడు పడితే అప్పుడు తింటే జలుబు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయి. పెరుగు చల్లని గుణం కలిగి ఉండటం వల్ల, దానిని ఉదయం లేదా మధ్యాహ్నం భోజనంలో తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉదయం భోజనంలో పెరుగు తీసుకుంటే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుది. ముఖ్యంగా శరీరంలో వేడి ప్రభావం తగ్గుతుంది. మధ్యాహ్నం పెరుగు తీసుకుంటే శరీరం చల్లగా ఉంటుంది. ముఖ్యంగా వేసవి వేడి నుండి శరీరాన్ని రక్షిస్తుంది. ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. రాత్రి పెరుగు తింటే దగ్గు, జలుబు వంటి సమస్యలు వస్తాయి. జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల పెరుగు జీర్ణం కావడం కష్టం అవుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో పెరుగు తింటే జీర్ణ సమస్యలు వస్తాయి. దీనివల్ల గ్యాస్, ఆమ్లత వంటి సమస్యలు వస్తాయి. వ్యాయామం వల్ల అధికంగా చెమట పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే పెరుగు తింటే జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయి. ఉదయాన్నే ఓ కప్పు పెరుగు తింటే మెటబాలిజం పెరుగుతుంది. ఎనర్జీగా ఉంటారు. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణశక్తిని పెంచి గట్ హెల్త్‌ని కాపాడుతుంది. ఇందుకోసం హోల్ గ్రెయిన్స్, సెరల్స్‌తో కలిపి తీసుకోవచ్చు. అయితే, లాక్టోస్ అసహనం ఉన్న వారు నైట్ టైం పెరుగును అస్సలు తినకపోవడమే మంచిది. ఒక వేల ఇలాంటి వారు రాత్రిపూట పెరుగును తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలను ఎదుర్కొవాల్సి వస్తుంది. లాక్టోస్ అసహనం ఉన్నవారు రాత్రిపూట పెరుగు తినకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.





# ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని తింటున్నారా..?

ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని వండేటప్పుడు ఆరోగ్యకరమైన ఆహారం కోసం కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఫ్రిజ్‌లో ఉంచిన మాంసం బయటకు తీసినప్పుడు కొన్నిసార్లు చల్లదనం కోల్పోతుంది. బాగా చల్లగా ఉన్న మాంసం బయట వేడి వాతావరణంలోకి వచ్చినప్పుడు బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఈ కారణంగా అది విషపూరితం అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ఫ్రిజ్‌లో నుండి తీసిన మాంసాన్ని ఎక్కువ సమయం వృథా చేయకుండా వెంటనే వండాలి లేదా తిరిగి ఫ్రిజ్ లోనే ఉంచాలి. ఫ్రిజ్ నుండి తీసిన మాంసాన్ని సరైన ఉష్ణోగ్రతలో ఉంచకపోతే.. అందులోని బ్యాక్టీరియా అనుకూల పరిస్థితుల్లో వేగంగా పెరుగుతుంది. చూడటానికి మాంసం తాజాగా అనిపించినప్పటికీ అది విషపూరితమయ్యే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి మాంసాన్ని తరచుగా వేడిగా లేదా చల్లగా ఉంచడం చాలా ముఖ్యం.ఫ్రిజ్ నుండి మాంసాన్ని బయటకు తీసినప్పుడు, దాని పైభాగం త్వరగా చల్లదనాన్ని కోల్పోతుంది.. అయితే లోపలి భాగం ఎక్కువసేపు చల్లగా ఉంటుంది. ఇది వండే సమయంలో రుచిలో మార్పులకు దారితీయవచ్చు. దీనివల్ల కొన్ని భాగాలు బాగా ఉడికి మరికొన్ని భాగాలు సరిగా ఉడకకపోవచ్చు.ఫ్రిజ్‌లో ఉంచిన మాంసాన్ని వండేటప్పుడు ఒకేసారి అధిక వేడితో కాకుండా.. అన్ని భాగాలు పూర్తిగా ఉడికేలా చూడాలి. మాంసం సరిగ్గా ఉడకడానికి ముందుగా ఉష్ణోగ్రతను క్రమంగా పెంచాలి.ఫ్రిజ్‌లో మాంసం నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద ఉండాలి. సాధారణంగా 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలో ఉంచడం ఉత్తమం. ఈ ఉష్ణోగ్రత బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తుంది. ఫ్రిజ్‌లో మాంసాన్ని కింద ఉండే అరలో ఉంచడం వల్ల అది ఎక్కువసేపు చల్లగా ఉంటుంది. ఫ్రిజ్ నుండి మాంసాన్ని తీసిన తర్వాత కాసేపు చల్లటి నీటిలో ఉంచడం మంచిది. ఈ ప్రక్రియ మాంసం చల్లగా ఉండటానికి, బ్యాక్టీరియా పెరిగే అవకాశాలను తగ్గించడానికి సహాయపడుతుంది. నీటిలో ఉంచిన తర్వాత దానిని వేడి లేదా చల్లగా ఉంచి వండటానికి ఉపయోగించవచ్చు. ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని ఎక్కువ రోజులు ఉంచితే పాడైపోతుంది. కాబట్టి వాడే ముందు అది మంచిగా ఉందో లేదో బాగా చూసుకోవాలి. ఏమైనా తేడా అనిపిస్తే తినకూడదు. ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాన్ని వండేటప్పుడు కొన్ని విషయాలు గుర్తుపెట్టుకుంటే ఆరోగ్యం పాడవకుండా ఉంటుంది. మాంసంలో బ్యాక్టీరియా తొందరగా పెరుగుతుంది, దానివల్ల ఫుడ్ పాయిజన్ అయ్యే ఛాన్స్ ఉంది, రుచి కూడా మారిపోతుంది. అందుకే మాంసాన్ని సరైన చల్లదనంలో ఉంచాలి, బాగా ఉడికించాలి. ఇలా చేస్తేనే మంచిగా, రుచిగా ఉంటుంది.



# కంటి ఆరోగ్యం కోసం ఖచ్చితంగా ఈ పండ్లు తినాల్సిందే

కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. కొన్ని ప్రత్యేకమైన పండ్లు జుట్టు, చర్మం వంటి వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన పోషకాలను అందించడంతో పాటు కంటి చూపును కూడా మెరుగుపరుస్తాయి. కంటి సమస్యలను తగ్గించుకోవడానికి సహాయపడే పండ్లను తీసుకోవడం ద్వారా మీరు మీ కంటి ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చు. మామిడి పండ్లలో ఉండే బీటా కెరోటిన్ వల్ల అది శరీరంలో విటమిన్ ఏగా మారుతుంది. విటమిన్ ఏ కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. దీని వల్ల కంటి వెలుగు మెరుగుపడుతుంది. మామిడి పండ్లు తింటే రేచీకటి సమస్యలు, కంటి కురులు తగ్గిపోతాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని పెంచేందుకు సహాయపడతాయి. బొప్పాయిలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, విటమిన్ ఇ, బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయి. ఈ పండ్లు కంటి కీళ్లను కాపాడే ప్రక్రియలను ప్రోత్సహిస్తాయి. బొప్పాయి తినడం వల్ల కంటి సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. అలాగే కంటి వెలుగును పెంచడంలో కూడా సహాయపడతాయి. కివీలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఈ విటమిన్ కంటిలోని రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. కివీ పండ్లు కంటిలోని రక్త ప్రసరణను పెంచి.. కంటి సమస్యలు దూరం చేయడంలో సహాయపడతాయి. కివీ తినడం ద్వారా కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది.నేరేడు పండ్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ పండ్లు కంటి సంబంధిత సమస్యలను తగ్గించడంలో, దృష్టి సమస్యలను నివారించడంలో సహాయపడతాయి.పుచ్చకాయలు అధికంగా నీటిని కలిగి ఉంటాయి. ఈ పండ్లు కంటిని హైడ్రేటెడ్‌గా ఉంచటంలో కీలకమైనవి. పుచ్చకాయలు తింటే కంటి సమస్యలు తగ్గిపోతాయి. ఇవి పొడి కన్నుల సమస్యను తగ్గించడంలో కూడా సహాయపడతాయి.అరటి పండ్లలో విటమిన్ ఏ, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. అరటి పండ్లు కంటి న్యూట్రియంట్స్‌ని పునరుద్ధరించడంలో సహాయపడతాయి. ఇవి కంటి సంబంధిత సమస్యలను కూడా తగ్గిస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ రుచికరమైన పండు.. ఇది విటమిన్ సి పుష్కలంగా కలిగి ఉంటుంది. ఈ పండులోని పోషకాలు కంటి ఆరోగ్యాన్ని పటిష్టం చేస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల కంటి వెలుగు పెరిగి కంటి సమస్యలు తగ్గిపోతాయి. సీతాఫలం ఎంతో రుచికరమైన పండు. ఇందులో విటమిన్ బి, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. వీటి వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. సీతాఫలం కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించే పోషకాలను అందిస్తుంది.సిట్రస్ పండ్లు కూడా కంటి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైనవి. నారింజ, నిమ్మ, జామ, ద్రాక్ష వంటి పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఈ పండ్లు కంటి కీళ్లను కాపాడటంలో, దృష్టి సమస్యలు తగ్గించడంలో సహాయపడతాయి. సిట్రస్ పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు కంటిని ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి ఆరోగ్యం నిరంతరం కాపాడుకోవాలి. అందుకు సరైన ఆహారం, ముఖ్యంగా పండ్లు తీసుకోవడం చాలా అవసరం. మామిడి, బొప్పాయి, కివీ, నేరేడు, పుచ్చకాయలు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకుంటే కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు. ఈ పండ్లను ప్రతిరోజూ తీసుకోవడం ద్వారా కంటి సంబంధిత సమస్యలు తగ్గిపోతాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# శిక్షణలు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచుతాయి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- అధునాతన బోధన ఉపాధ్యాయుల లక్షణంగా ఉండాలి
- ఉపాధ్యాయులు ఎప్పుడూ ముందుచూపుతో వ్యవహరించాలి
- 21వ శతాబ్దపు నైపుణ్యాలను ఉపాధ్యాయులు కలిగి ఉండాలి
- ఉపాధ్యాయుల శిక్షణలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ జిల్లాలో జరుగుతున్నటువంటి ఉపాధ్యాయుల శిక్షణలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సందర్శించి ఉపాధ్యాయులతో మమేకమయ్యారు. శిక్షణలు ఏ విధంగా జరుగుతున్నాయో జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న వివిధ సబ్జెక్టులలో శిక్షణ పొందుతున్నటువంటి ఉపాధ్యాయుల సమావేశపు హాలులలోకి ప్రవేశించి ఉపాధ్యాయులతో ముచ్చటించారు. శిక్షణలు ఎలా ఉన్నాయి? ఇంకా ఏమైనా నూతన పద్ధతులు , నూతన విషయాల పట్ల శిక్షణ అవసరము ఉందా అని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ అధునాతన బోధన పద్ధతులతో పాటు, 21వ శతాబ్దపు బోధన మెలకువలను కలిగి ఉండాలని, దానికోసము శిక్షణలు అవసరమని ఆమె తెలిపారు. ప్రభుత్వము బైలింగ్వల్ ద్విభాష పాఠ్యపుస్తకాలను అందిస్తుందని, వాటి యొక్క అవసరము ఎలా ఉందని , వాటి ఉపయోగం ఎలా ఉందని ,ఆమె ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులలో ఆంగ్లం నైపుణ్యాలు పెంచాలని, తరగతి గదిని డిజిటలైజ్ చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల యొక్క ప్రవర్తనలను గమనించి, వారికి నైతిక విలువల పెంపు పట్ల అవగాహన కల్పించాలని, మార్గదర్శనం చేయాలని ఆమె తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు కూడా ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ను ఉపయోగించి బోధన చేయాలని, ఉపాధ్యాయులు బోధనోపకరణాలను వాడటం ద్వారా విద్యార్థుల యొక్క అభ్యసనము సులువు అవుతుందని ఆమె తెలిపారు. గత మూడు రోజులుగా స్కిల్ స్టార్ కు ఇంటర్నేషనల్ పాఠశాలలో జరుగుతున్నటువంటి శిక్షణలలో సుమారు 470 మంది ఉపాధ్యాయులు గణితము, ఆంగ్లము ,సాంఘిక శాస్త్రము, ఉర్దూ ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, మండల స్థాయి రిసోర్స్ పర్సన్ లకు శిక్షణ కొనసాగుతోంది. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి డి. వాసంతి, గుణాత్మక విద్య సమన్వయకులు ఏ. శ్రీనివాస్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి, సెంటర్ ఇన్చార్జిల, రిసోర్స్ పర్సన్ లు పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్సే మార్గం

- ఎంపీ కడియం కావ్య
- రాహుల్ గాంధీని ప్రధాని చేయాలన్నదే మన లక్ష్యం

స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:




దేశంలో రాజ్యాంగాన్ని సమగ్రంగా రక్షించగల పార్టీ కేవలం కాంగ్రెస్సె అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత, నిర్మాణ సన్నాహక సమావేశం రఘునాథపల్లి మండలం నిడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. కడియం కావ్య, పార్టీ శ్రేణులకు ఉద్దేశించి మాట్లాడారు.

ఈ దేశాన్ని బిజెపి పరిపాలన నుంచి విముక్తి చేయాలంటే కాంగ్రెస్ పార్టీ బలపడాలని, అందుకు పార్టీ కార్యకర్తలంతా ఒక్కో సైనికుడిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "మనం బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ బాగుండాలి. పార్టీ బలోపేతం అయితేనే ప్రజల సంక్షేమం సాధ్యం" అని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ మతతత్వానికి ప్రోత్సాహమిచ్చే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించిన ఆమె, బీజేపీ, బీఆర్ఎస్ ఒకే బాటలో నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేతుల్లో కీలు బొమ్మలా మారారని విమర్శించిన ఆమె, 1971లో ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయం ద్వారా ఇండో పాక్ యుద్ధంలో భారత్ ఘన విజయం సాధించిందని గుర్తు చేశారు. మోడీ పాలనపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతోందని, గుజరాత్ మోడల్ కేవలం బూటకమేనని అన్నారు.

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను గుర్తు చేస్తూ, ఆయన ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా దేశానికి సత్యాన్ని తెలియజేయగలిగారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతయినా ఉందని, అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పోరాటం చేయాలన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్‌ను రెండవ రాజధానిగా అభివృద్ధి చేయడానికి 6,000 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, ఇందులో భాగంగా స్మార్ట్ సిటీ, భూగర్భ డ్రైనేజీ, రింగ్ రోడ్, మామునూరు విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, మెగా టెక్స్‌టైల్ పార్కు వంటి పలు ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు.

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ఒక్క ఏడాదిలోనే 1000 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దక్కుతుందని కొనియాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని, పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్, జంగా రాఘవరెడ్డి, రియాజ్ అహ్మద్, ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్లు లావణ్య శిరీష్ రెడ్డి, శివరాజ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



# మామా అల్లుడు.. ఇద్దరూ దేవాలే

సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ ఆగస్ట్ 14 విడుదల కాబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రమోషన్లు ఊపందుకున్నాయి. దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇంటర్వ్యూలు వైరల్ కావడం మొదలయ్యాయి. ఇంకా సరైన టీజర్ రాకుండా కేవలం ప్రోమో వీడియోలతోనే హైప్ ఎక్కడికో వెళ్ళిపోతోంది. నాగార్జున, అమీర్ ఖాన్, ఉపేంద్ర మల్టీ స్టారర్ క్యామియోలు అంచనాలను ఎక్కడికో తీసుకెళ్తున్నాయి. ఇందులో రజని పాత్ర పేరు దేవా. పోర్టులో మాఫియా సామ్రాజ్యం నడిపే ఒక పవర్ ఫుల్ క్యారెక్టర్ లో ఆయనని చూపించే విధానం మాములుగా ఉండదట. ఎలివేషన్లు, యాక్షన్ బ్లాకులు ఓ రేంజ్ లో వచ్చాయని టాక్. కాకతాళీయంగా కూలికి రెండు నెలల ముందు జూన్ 20 రిలీజవుతున్న కుబేరలో ధనుష్ పేరు కూడా దేవానే. బిచ్చం అడుక్కునే స్థాయి నుంచి ఆర్థిక వ్యవస్థని శాశించే కోటీశ్వరుడిగా హీరో పాత్రని దర్శకుడు శేఖర్ కమ్ముల చాలా ఇంటెన్స్ గా డిజైన్ చేశారట. అంటే పేరులోనే కాదు క్యారెక్టరైజేషన్ పరంగానూ కూలి, కుబేరలకు దగ్గరి పోలికలు కనిపిస్తున్నాయి. విచిత్రం ఏమిటంటే ఈ రెండు సినిమాల్లోనూ నాగార్జున ఉండటం. రజని కూతురితో ధనుష్ విడిపోయినప్పటికీ ఫ్యాన్స్ దృష్టిలో మాత్రం ఇద్దరూ మామ అల్లుడే. అందుకే ఇంత దగ్గరి సారూప్యతలు గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. కంటెంట్, బిజినెస్ పరంగా కూలి, కుబేరలు హయ్యెస్ట్ ఫిగర్స్ నమోదు చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. డబ్బింగ్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడుతోంది. మన నిర్మాతల పోటీని చూసి ధరను వేలం పాట రేంజ్ లో పెంచుతున్నారని డిస్ట్రిబ్యూటర్ వర్గాల టాక్.

# 'తమ్ముడు'కి ఎన్నెన్ని కష్టాలో..



నితిన్ కెరీర్లో చాలా కీలకమైన సినిమా.. తమ్ముడు. 'భీష్మ' తర్వాత నితిన్‌కు ఓ మోస్తరు హిట్ కూడా లేదు. చెక్, రంగ్ దె, మాచర్ల నియోజకవర్గం, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్.. ఇలా వరుసగా తన సినిమాలు నిరాశపరిచాయి. చివరి చిత్రం 'రాబిన్ హుడ్' అయినా మ్యాజిక్ చేస్తుందనుకుంటే అది మరో డిజాస్టర్ అయింది. దీంతో తర్వాతి చిత్రం 'తమ్ముడు' మీద చాలా ఆశలు పెట్టుకున్నాడతను. 'వకీల్ సాబ్' దర్శకుడు వేణు శ్రీరామ్ రూపొందిస్తున్న చిత్రమిది. ఈ సినిమా మేకింగ్ అనుకున్న దాని కంటే చాలా ఆలస్యం అయింది. బడ్జెట్ కూడా విపరీతంగా పెరిగిపోయింది. దీనికి తోడు ఈ చిత్రానికి సరైన రిలీజ్ డేటే కుదరట్లేదు. ముందేమో మహాశివరాత్రి అన్నారు. తర్వాత వేసవి రిలీజ్ అన్నారు. చివరికి జులై 4కు కొత్త డేట్ ప్రకటించారు. ఈసారి పక్కాగా ఆ డేట్‌కు రిలీజ్ చేస్తామని చెప్పుకున్నారు. ఇటీవలే రిలీజ్ డేట్ మీదే ఒక స్పెషల్ వీడియో కూడా చేసింది 'తమ్ముడు' టీం. రిలీజ్ మళ్లీ మళ్లీ వాయిదా పడుతుండడం.. ఏదో ఒక డేట్ ఫిక్స్ చేయకపోవడం మీద టీం తమ మీద తామే సెటైర్లు వేసుకుని చివరికి జులై 4న సినిమా రాబోతోందని ప్రకటించుకున్నారు. రెండు రోజుల ముందు కూడా 'తమ్ముడు' థీమ్ గురించి ఒక వీడియో రిలీజ్ చేసి అందులోనూ రిలీజ్ డేట్‌ను నొక్కి వక్కాణించారు. తీరా చూస్తే 'కింగ్‌డమ్' కోసమని ఇప్పుడు 'తమ్ముడు'ను వాయిదా వేసుకున్నారు. ఇలాంటి సర్దుబాట్లు ఇండస్ట్రీలో మామూలే కానీ.. అసలే నితిన్ స్ట్రగుల్లో ఉంటే తన సినిమాకు ఇన్నిసార్లు రిలీజ్ డేట్ మార్చి, ఇంత ఆలస్యం చేస్తే అది సినిమాకు నెగెటివ్ అయ్యే ప్రమాదముంది. వీలైనంత త్వరగా కొత్త డేట్ ఎంచుకుని.. ఆ తేదీకైనా పక్కాగా సినిమాను రిలీజ్ చేస్తే బెటర్.

# రంగస్థలం కంటే గొప్పగా పెద్ది




'పెద్ది' సినిమా రంగస్థలం కంటే గొప్పగా ఉండబోతుంది. ఆర్ఆర్ఆర్‌ను కూడా మించి ఉంటుంది. మామూలుగా అన్ని సినిమాలకు ఇలా చెప్పను. కానీ ఈసారి రాసిపెట్టుకోండి అని చెప్తున్నా. 30 శాతం షూటింగ్ పూర్తయ్యింది. మిగతా భాగం మరింత అద్భుతంగా ఉంటుంది' అని సినీ నటుడు రామ్‌చరణ్ అన్నారు. ఆయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రం 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పాన్ ఇండియా చిత్రమిది. జాన్వీకపూర్ కథానాయిక. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. లండన్‌లోని టుస్సాడ్స్ మ్యూజియంలో తన మైనపు విగ్రహావిష్కరణ కోసం రామ్‌చరణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల వెళ్లారు. రామ్‌చరణ్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. అనంతరం ఫ్యాన్స్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. "పెద్ది' సినిమాకు సంబంధించిన అప్డేట్స్ పంచుకున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ఈ సినిమా. 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ ఈ జోనర్‌లో చేస్తున్న సినిమా ఇదే. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, మీర్జాపూర్ మున్నా భయ్యా దివ్యేన్దు, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఎఆర్ రెహమాన్ సంగీతం. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట్ సతీష్ కిలారు భారీబడ్జెట్‌తో ఈ మూవీని నిర్మిస్తున్నారు.

# ప్రి క్వార్టర్స్‌కు ఆకర్షి, ఉన్నతి

థాయిలాండ్ ఓపెన్ సూపర్300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో ఆకర్షి కశ్యప్ మూడుసెట్ల హోరాహోరీ పోరులో 2116, 2022, 2220తో ఎగ్జిన్ సుగియామా(జపాన్)పై విజయం సాధించింది. 17ఏళ్ల ఆకర్షి తొలి గేమ్‌ను సునాయాసంగా చేజిక్కించుకున్నా.. రెండో గేమ్‌ను ముగించడానికి చెమటోడ్చాల్సి వచ్చింది. ఇక ఉన్నతి హుడా 2114, 1821, 2321తో నితిత్‌కరారు(ఇండోనేషియా)పై చెమటోడ్చి నెగ్గింది. మరో పోటీలో సంతోష్ రామ్‌రాజ్ 1921, 721తో 8వ ర్యాంక్ క్రీడాకారిణి, సింగపూర్‌కు చెందిన యోజిమిన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక మాళ్విక బన్సోద్ 2112, 1321, 2117తో సింగపూర్‌కు చెందిన నిషిహాన్‌పై పోరాడి గెలుపొందగా.. అనుపమ ఉపాధ్యాయ 1121, 921తో 7వ ర్యాంకర్ థాయిలాండ్ కు చెందిన ఇంటనాన్ చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ప్రధాన టోర్నీకి అర్హత సాదించిన తరుణ్ మన్నేపల్లి, స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, ప్రియాన్షు రాజ్‌వత్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు.








# మూడో ర్యాంక్‌లో హర్మన్‌ప్రీత్ సేన

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ సేన సత్తా చాటింది. ఐసిసి బుధవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ 8రేటింగ్ పాయింట్లు జమ చేసుకొని 2వ ర్యాంక్‌లో ఉన్న ఇంగ్లండ్‌కు చేరువైంది. శ్రీలంక వేదికగా జరిగిన ముక్కోణపు సిరీస్ టైటిల్‌ను చేజిక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సేన ఖాతాలో ఎనిమిది రేటింగ్ పాయింట్లు జమ అయ్యాయి. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్(121 రేటింగ్ పాయింట్లు) 3వ స్థానంలో నిలువగా.. ఇంగ్లండ్(127) 2వ స్థానంలో ఉంది. ఇక ఆస్ట్రేలియా మహిళల జట్టు 167 రేటింగ్ పాయింట్లతో మిగతా జట్లకు అందనంత దూరంలో టాప్‌లో కొనసాగుతోంది. ఇక న్యూజిలాండ్(96), దక్షిణాఫ్రికా(90) టాప్5లో నిలువగా.. శ్రీలంక(82), వెస్టిండీస్(72), బంగ్లాదేశ్(79), పాకిస్తాన్(78) టాప్10లో చోటు దక్కించుకున్నాయి.

# మున్నాభాయ్ సీక్వెల్ మళ్లీ అటకెక్కిందా?



చేసిన సినిమాలు తక్కువే అయినా.. ఇండియన్ ఫిలిం హిస్టరీలోనే గ్రేటెస్ట్ డైరెక్టర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు రాజ్ కుమార్ హిరాని. కెరీర్ ఆరంభంలోనే ఆయనకు గొప్ప పేరు తెచ్చిన చిత్రాలు.. మున్నాభాయ్ ఎంబీబీఎస్, లగేరహో మున్నాభాయ్. ఆ తర్వాత 3 ఇడియట్స్, పీకే, సంజు లాంటి క్లాసిక్స్ అందించాడు. ఆయన చివరి చిత్రం 'డంకీ' ఓ మోస్తరు ఫలితాన్నందుకుంది. మళ్లీ తన మార్కు చూపించడానికి 'మున్నాభాయ్' ఫ్రాంఛైజీ మీద హిరాని దృష్టిసారించినట్లు వార్తలు వచ్చాయి. హిరాని సైతం తాను 'మున్నాభాయ్3' స్క్రిప్టు మీద పని చేస్తున్నట్లు చెప్పాడు.ఈ సీక్వెల్ గురించి చాలా ఏళ్ల కిందటే వార్తలు వచ్చాయి. 'మున్నాభాయ్ ఛలే అమెరికా' పేరుతో సినిమా అనుకున్నారు. కానీ అది ముందుకు కదల్లేదు. ఐతే ఇటీవల 'మున్నాభాయ్3' మీద హిరాని సీరియస్‌గా కనిపించడంతో ఆ సినిమా పట్టాలెక్కుతుందనే అనుకున్నారు. కానీ స్క్రిప్టు అనుకున్నంత బాగా రాలేదా.. లేక వేరేదైనా కారణాలున్నాయా తెలియదు కానీ.. హిరానీ ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టును పక్కన పెట్టేశాడని అంటున్నారు. ప్రస్తుతం ఆయన విక్రాంత్ మాసే, విక్కీ కౌశల్‌తో కలిసి ఒక వెబ్ సిరీస్ తీసే పనిలో పడ్డారు. ఇది పూర్తయ్యాక ఆమిర్ ఖాన్‌తో హిరాని జట్టు కట్టబోతున్నారట. 3 ఇడియట్స్, పీకే తర్వాత హ్యాట్రిక్ మూవీ మీద వీళ్లిద్దరూ పని చేయబోతున్నారట. తమ శైలికి తగ్గట్లే లైట్ హార్టెడ్ కామెడీ, ఎమోషనల్ టచ్ ఉన్న సబ్జెక్టుతో సినిమా చేయడానికి రెడీ అవుతున్నారట. వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్లొచ్చని సమాచారం. దీంతో 'మున్నాభాయ్3'కి మరోసారి బ్రేక్ పడినట్లే అని.. ఇక ఆ సినిమా తెరకెక్కడం అనుమానమే అని బాలీవుడ్ వర్గాల సమాచారం.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in